విద్యతో పాటు సేవాభావం కలిగి ఉండాలి

విశాలాంధ్ర-కవిటి: విద్యార్థులకు విద్యాతో పాటు సేవాభావం అవసరమని వక్తలు అన్నారు. ఈ మేరకు సోమవారం కవిటి మండలం నెలవకం, దుర్గాంపుట్టుగ గ్రామాల్లో ఎస్విజె డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిటు 1,2 విద్యార్థులు ఆయా గ్రామాల్లో మొదటి రోజు గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో పలువురు మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని, అలాంటి విద్యార్థులే సమాజంలో గుర్తింపు పొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్విజె డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, ఎన్ఎస్ఎస్ పివో ఆర్.మహేష్, సిఆర్పి తులసి, ఆయా గ్రామాల పెద్దలు, వలంటీర్లు పాల్గొన్నారు.

సిక్కోలు పుస్తక మహోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-టెక్కలి: శ్రీకాకుళం ఏడు రోడ్ల జంక్షన్ వద్ద గల మున్సిపల్ మైదానంలో నవంబరు 11 నుండి 20 వరకు జరుగు పుస్తక మహోత్సవంలో సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక ప్రదర్శనలు పిల్లలను, పెద్దలను అలరించనున్నాయని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పిలి కామేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం ఉదయం సిక్కోలు పుస్తక మహోత్సవ గోడపత్రికల ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తక మహోత్సవంలో సుమారు 100 పుస్తక స్టాల్స్, శ్రీకాకుళం జిల్లాలో గల కవుల సాహిత్య ఘోస్టులు, కవితా పఠనాలు,

జానపద, శాస్త్రీయ కళా ప్రదర్శనలు, మ్యాజిక్ షోలు, అంతరిక్ష వీక్షణాలు ప్రతిరోజు సాయంత్రం నాలుగున్నర గంటల నుండి రాత్రి 9 గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ రాజేష్, యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దాలయ్య, పిఆర్టియు నాయకులు బాబురావు, రామచంద్ర రావు, మధు మాస్టర్, రెడ్డి, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్ నగర్‌లో పనుల గుర్తింపు

విశాలాంధ్ర- నరసన్నపేట: శ్రీరామ్ నగర్ కాలనీలో సోమవారం పంచాయతీరాజ్ అధికారులు సందర్శించి, కొన్ని పనులను గుర్తించారు. ఆదివారం ఉదయం ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తిని శ్రీరామ్ నగర్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి, కాలనీలో పలు సమస్యలు వివరించారు. ఈ విషయమే స్పందించిన ఎమ్మెల్యే, రమణమూర్తి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను శ్రీరామ్ నగర్ కాలనీకి పంపించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఏ.ఈ, బగ్గు నర్సింగరావు కాలనీలో ఉన్న పలు వీధులను, కొలిచి సిమ్మెంటు రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో

శ్రీరామ్ నగర్ అసోసియేషన్ ప్రతినిధులు, బాలగంగాధర్, వెంకటేశ్వరరావు, గుజ్జల హరిప్రసాద్, నక్క లోకేశ్వరరావు, చంద్రశేఖర్, బోయిన నరసింహమూర్తి, టేకి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: మండలం పోతునాయుడుపేటలో ఆర్ అండ్ బి రోడ్డుకు ఆనుకుని ఉన్న 12 సెంట్లు ప్రభుత్వ భూమిని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించుకున్నారు. పంట పొలాలకు నీరు పారే కాలువను ఆక్రమించి మట్టి వేసి ఎత్తు చేశారు. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేసి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన రెవెన్యూ అధికారులు ఆక్రమణ వాస్తవమని తేల్చి సంబంధిత రియల్ ఎస్టేట్ వ్యాపారికి నోటీసులను అందజేశారు. నోటీసులు ఇచ్చి రెండు నెలలు కావస్తున్న ఆక్రమణలను తొలగించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న రెవెన్యూ సిబ్బంది రియల్ ఎస్టేట్ వ్యాపారితో కుమ్మక్కైపోయారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆక్రమించిన భూమి విలువ ప్రస్తుత మార్కెట్‌లో సుమారు 30 లక్షల వరకు ఉంటుందని అంచనా. మూలపేట పోర్టు నిర్మాణం చేపట్టడంతో భూములు విలువ అమాంతంగా పెరగడంతో ప్రభుత్వ భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్ను పడింది. దీనికి తోడు కొందరు క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు సపోర్ట్ ఇవ్వడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు మరింత బరితెగిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై తహశీల్దార్ హేమసుందర్రావును అడుగగా ప్రభుత్వ భూమి ఆక్రమణ నిజమేనని, సంబంధిత రియల్ ఎస్టేట్ వ్యాపారికి నోటీసులు కూడా అందజేశామని అన్నారు.

వయోడెక్టు నుంచి కిందికి పొంగిపొర్లుతున్న నీరు

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస దరి గేదెలవాని పేట జంక్షన్ వద్ద వయోడెక్ట్ పైనుంచి సాగునీటి ప్రవాహం కిందికి పొంగి పొర్లుతుంది. వంశధార కుడి సాగునీటి కాలువకు అనుసంధానంగా ఉన్న వయోడెక్ట్ ద్వారా సాగునీరు అధికంగా రావడంతో గేదెల వాని పేట వద్ద కిందికి పొంగిపొర్లుతోంది. దీంతో ఆ క్రింది నుండి వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. స్వర్గీయ బొడ్డే పల్లి రాజగోపాలరావు వంశధార ప్రాజెక్ట్ పరిధిలోని అధికారులు పలుమార్లు సమస్య తలెత్తుతున్నప్పటికీ చర్యలు చేపట్టలేదు. దీంతో ఎప్పటికప్పుడు వాలు పగుళ్లు ఏర్పడి కిందికి నీరు పొంగి కిందికి జారటంతో నాసుబారి ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తుంది. గతంలో కూటమి పార్టీకి చెందిన బీజేపీ నాయకులు పలుమార్లు సందర్శించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో కమిటీ పరిశీలన చేసి తీసుకోవలసిన చర్యలపై నివేదికలను ఉన్నతాధికారులకు అందించారు. నేటికీ నివేది కలలోని అంశాలను పరిశీలించకపోవడంతో మళ్లీ పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి నీటి ప్రవాహాన్ని తగ్గించి మరమ్మతులు చేపట్ట వలసిన అవసరం ఉందని పలువురు రైతులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

ప్రపంచ శాంతి, అభివృద్ధిలో సైన్స్ కీలకం

- ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు బి.వి.ఎస్.ఎన్.రాజు, గౌరవాధ్యక్షులు శ్రీరామమూర్తి, ఇందిరా ప్రసాద్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: ప్రపంచ శాంతి, అభివృద్ధిలో సైన్స్ కీలకం అని ఇస్కఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు బి.వి.ఎస్.ఎన్.రాజు, గౌరవాధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తి, గేదెల ఇందిరా ప్రసాద్‌లు వెల్లడించారు. సోమవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రపంచ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 10న శాంతి, అభివృద్ధి కోసం ప్రపంచ సైన్స్ దినోత్సవం జరుపుకుంటామన్నారు. ఇది శాస్త్రీయ పురోగతిని ప్రజలకు తెలియజేయడానికి, అభివృద్ధి చెందుతున్న శాస్త్రీయ సమస్యలపై చర్చలలో ప్రజలను భాగస్వామ్యం చేయడానికి, శాంతియుత, స్థిరమైన భవిష్యత్తును నిర్మించడంలో సైన్స్ యొక్క కీలక పాత్రను నొక్కి చెప్పడానికి ఉద్దేశించబడిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా శాస్త్రీయ పురోగతిని బలోపేతం చేయడానికి, అందరికీ శాస్త్రీయ అక్షరాస్యతను అందుబాటులోకి తీసుకురావడానికి అంతర్జాతీయ కార్యక్రమాలను ప్రోత్సహించాలన్నారు. శాంతి, అభివృద్ధి కోసం స్థిరమైన భవిష్యత్తుకు మార్గం సైన్స్‌తో ప్రారంభమవుతుందన్నారు. మన దైనందిన జీవితాలలో విజ్ఞాన శాస్త్రం యొక్క ప్రాముఖ్యత, ఔచిత్యాన్ని కూడా నొక్కి చెబుతుందన్నారు. విజ్ఞాన శాస్త్రాన్ని సమాజంతో మరింత దగ్గరగా అనుసంధానించడం ద్వారా, విజ్ఞాన శాస్త్రంలో జరుగుతున్న పరిణామాల గురించి పౌరులకు తెలియజేయడం ప్రపంచ శాంతి, అభివృద్ధి విజ్ఞాన దినోత్సవం లక్ష్యం అన్నారు. దేశాల మధ్య ఉమ్మడి శాస్త్ర విజ్ఞానం కోసం జాతీయ, అంతర్జాతీయ సంఘీభావాన్ని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్ వనిత వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్, జంబో కోచ్ గేదెల లక్ష్మి, దస్తావేజు లేఖరి ఎన్ వి.కామేశ్వరరావు, కోణార్క్ స్వీట్ జి.గోపాలరావు, టెలివిజన్ సాంకేతిక నిపుణులు పి.తిరుపతిరావు, పి.తిరుపతిరావు, వ్యాపారవేత్త పి.శేఖర్, సామాజికవేత్త మామిడి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

విశాలాంధ్ర-హిరమండలం: మండల కేంద్రం హిర మండలం మేజర్ పంచాయతీలోని అలికం, బత్తిలి, ఏబీ రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో పేరుకు పోయిన చెత్త చెదారాన్ని పారిశుధ్య కార్మికులు తొలగిస్తున్నారు. సోమవారం డిప్యూటీ ఎంపీడీఓ డి.గోవిందరావు, ఈఓ మూల భాస్కర్‌రావులు పరిశీలించారు. చాలా దగ్గర్లో కాలువలు మీద సిమ్మెంట్ రోడ్డును వేసి ఉండడం వలన పూడికతీత పనులు ఆలస్యం జరిగాయని అన్నారు. చెత్త చెదారం సేకరించేందుకు ప్రతీ రోజు ఉదయం పంచాయతీ చెత్త సేకరణ వాహనం వస్తుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్: కళ్లేపల్లిలో కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడవరోజు అక్షరాస్యత దాని ఆవశ్యకతపై గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. ఏ విధంగా చదివితే భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో ఉంటామో అవగహన కార్యక్రమాన్ని స్థానిక విద్యార్థులకు నిర్వహించారు. అనంతరం కంప్యూటర్ అక్షరాస్యతపై అవగహన కల్పించి ప్రస్తుతం టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందిందో వివరించారు. కార్యక్రమం కళాశాల ఎన్ఎస్ఎస్ పిఓలు హరి మానస,పైడిరాజు ఆధ్వర్యంలో జరిగింది.

అన్నదానం మహా పుణ్యకార్యం

- ఎస్ఎస్ఆర్‌ట్రస్ట్ అధినేత డా. సూర శ్రీనివాసరావు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: ఉమారుద్ర కోటేశ్వరాలయంలో సోమవారం కార్తీక మాసం మూడవ సోమవారం పురస్కరించుకొని ఎస్-ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2,500 మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ సూర శ్రీనివాసరావు స్వయంగా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ భక్తులకు అన్నసేవ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం చేయడం మనసుకు అపూర్వమైన ప్రశాంతతను ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, బోర్డు సభ్యులు, పట్టణ ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ హరికృష్ణతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎయూలో సీపీ బ్రౌన్ జయంతి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషిచేసిన ఆంగ్లేయ అధికారి సీపీ బ్రౌన్ 227వ జయంతిని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో సీడెడ్ జిల్లాల కలెక్టర్గా నియమితులైన బ్రౌన్ తెలుగు భాషను నేర్చుకుని తన జీవితమంతా తెలుగు అధ్యయనానికి అంకితం చేశారన్నారు. ఈ సందర్భంగా బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య, వర్సిటీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు, డాక్టర్ కె. స్వప్నవాహిని తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత హోంగార్డుకు ఆర్థిక చేయూత

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ఇటీవల రిటైర్మెంట్ పొందిన విశ్రాంత హోంగార్డు జి.తిరుపతిరావుకు సహచర హోంగార్డులు స్వతహాగా ముందుకు వచ్చి తమ ఒక్కరోజు గౌరవ వేతనం సమకూర్చి సేకరించిన 4.11 లక్షల రూపాయల నగదు చెక్కును సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సహచర పోలీసు సిబ్బంది చూపిన ఈ సహకారం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి గోపినాథ్, ఆర్ఎస్సై వెంకట రమణ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి శిక్షణ ఇవ్వాలి

- ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: రాష్ట్ర పోలీస్ శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన వారి శిక్షణను తక్షణమే ప్రారంభించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా సమితి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖలో 2022 నవంబరులో విడుదలైన కానిస్టేబుల్ పోస్టుల నోటిఫికేషన్ ప్రకారం ప్రిలిమ్స్, ఫిజికల్ టెస్టులు, మెయిన్స్, మెడికల్ పరీక్షలు వంటి అన్ని దశలు పూర్తయ్యాయని, సుమారు 6,100 మంది యువత ఈ నియామక ప్రక్రియలో విజయవంతమై, పోలీస్ శాఖలో శిక్షణ ప్రారంభం కావాలనే ఆశతో నెలలుగా ఎదురుచూస్తున్నారన్నారు. ఈ నియామక పక్రియ ప్రారంభమై నాలుగేళ్లు గడిచినా ఇప్పటికీ శిక్షణ తరగతులు ప్రారంభం కాలేదని, వేలాది మంది యువకుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని, వారి కుటుంబాలు మానసిక, ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఎంపికైన 6,100 మంది కానిస్టేబుళ్ల శిక్షణ షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేసి శిక్షణ కార్యక్రమాలను తక్షణమే ప్రారంభించి, నియామక ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. ఈ నియామక ప్రక్రియలో జరిగిన అనవసర ఆలస్యాలకు బాధ్యత వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ టౌన్ కన్వీనర్ వై.వేణు, ఏఐవైఎఫ్ నాయకులు ఎం.శ్యామ్, ఎస్.అన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి కార్యకర్తలే మూలస్తంభాలు

విశాలాంధ్ర-కవిటి: టీడీపీకి కార్యకర్తలే మూల స్తంబాలు, వారే నాయకులని, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు అన్నారు. ఈ మేరకు సోమావరం రామయ్యపుట్టుగ లోని ప్రభుత్వ విప్ క్యాంప్ కార్యాలయంలో నియోజక వర్గంలోని కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించి పార్టీ సంస్థాగత ఎన్నికలపై చర్చించారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా వచ్చిన వజ్జ బాబురావు మాట్లాడుతూ పార్టీ సంస్థగత ఎన్నికల్లో యువతకు, మహిళలకు, బడుగు బలహీన వర్గాలకు అవకాశం కల్పిస్తూ గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ప్రతి పదవికి పనిచేసే సేవలే కొలమానం అని అన్నారు. సంస్థాగత ఎన్నికల్లో నాయకుల రిఫార్సులకు తావులేకుండా ప్రజల అభీష్టం మేరకు ఎన్నుకోవాలని కోరారు. రెండు, మూడు రోజుల్లో మండల, వార్డు, గ్రామస్థాయి కమిటీల ఎన్నికలు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతపట్నం నియోజకవర్గాన్ని శ్రీకాకుళం జిల్లాలోనే ఉంచాలి

విశాలాంధ్ర - కొత్తూరు: పలాస (ప్రతిపాదిత) జిల్లాలో పాతపట్నం నియోజకవర్గం కలిపితే అసౌకర్యంగా ఉంటుందన్న విమర్శలు ఇక్కడ ప్రజలు నుండి వినిపిస్తున్నాయి. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో ఈ నియోజకవర్గం ఉంది. ప్రజలకు సౌకర్యంగా అందుబాటులో ఉండాలన్న దృక్పధంతో టీడీపీ, కూటమి ప్రభుత్వం జిల్లా, డివిజన్‌లు పునర్ విభజనకు సిద్ధమైంది. పాత పట్నం నియోజకవర్గంలో పాత పట్నం, మెలియాపుట్టి, ఎల్.ఎన్. పేట, హిరమండలం, కొత్తూరు మండలాలున్నాయి. ఇందులో పాతపట్నం, మెలియాపుట్టి మండలాలకు ప్రతిపాదిత పలాస జిల్లా కొంతలో కొంత దగ్గరగా ఉంటాయి. కొత్తూరు, హిరమండలం, ఎల్. ఎన్.పేట మండలాలకు మాత్రం పలాస జిల్లా కేంద్రం సగటు వంద కిలోమీటర్లు దూరం పైగా ఉంటుంది. నేరుగా బస్సుల సౌకర్యం లేదు. పాత పట్నం నియోజకవర్గం పలాస జిల్లాలో కలుపుతారన్న వార్తలు మీడియాలో వస్తుండడంతో ఇక్కడ రాజకీయాలకు అతీతంగా విమర్శలు వస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో పాత పట్నం నియోజకవర్గం ఉంచాలని పలువురు కోరుతున్నారు.

ఈ మేరకు కూటమి నేతలు వినతి పత్రాలు కూడా ఇచ్చారు. కాగా ఒక నియోజకవర్గం మొత్తం ఒకే జిల్లాలో ఉండాలి అన్న నిబంధనలు పక్కన పెట్టి ఆయా మండలాల సౌలభ్యాన్ని బట్టి జిల్లాల పునర్ విభజన చేపడితే కొంత మేర ప్రజలకు జిల్లా కేంద్రాలు చేరువులో ఉంటాయని పలువురు

ఈసీఐ మార్గదర్శకాలతోనే పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలోని పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (మార్పులు, చేర్పుల ప్రక్రియ) పనులు తప్పనిసరిగా భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారమే జరగాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీలు, అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రక్రియ ఓటర్లకు మెరుగైన సౌకర్యాన్ని అందించే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో కొత్తగా 105 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 2,358 కేంద్రాలకు అదనంగా ఈ కొత్త ప్రతిపాదనలు ఆమోదం పొందితే, మొత్తం కేంద్రాల సంఖ్య 2,463కు చేరుకుంటుంది. గతంలో తాత్కాలికంగా ఉన్న సహాయక పోలింగ్ కేంద్రాలను శాశ్వత కేంద్రాలుగా మార్చడంలో భాగంగా ఈ ప్రతిపాదనలు తయారుచేసినట్లు ఆయన వివరించారు. ఈ మార్పులు, చేర్పుల ప్రక్రియలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 1200, పట్టణ ప్రాంతాల్లో

1400 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న కేంద్రాలలో రద్దీని తగ్గించడానికి కొత్త కేంద్రాలను ఏర్పాటు అవసరాన్ని చెప్పారు. ప్రతిపాదిత 105 కొత్త పోలింగ్ కేంద్రాలలో శ్రీకాకుళం నియోజకవర్గంలో అత్యధికంగా 45 కేంద్రాలు, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 20 కేంద్రాలు, పలాస 18, ఆమదాలవలస 11, ఎచ్చెర్ల 7, టెక్కలిలో 4 కొత్తగా పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదించామని, నరసన్నపేట, పాతపట్నంలలో పోలింగ్ కేంద్రాలు పాతవే కొనసాగుతాయని వివరించారు. సమావేశంలో ఎస్డీసీలు జయదేవి, పద్మావతి, ఆయా పార్టీల ప్రతినిధులు కలమట వెంకట రమణ, పీఎంజే బాబు, మాదారపు వెంకటేష్, కెవిఎల్ఎస్.ఈశ్వరి, రౌతు శంకరరావు, సురేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్ దృష్టికి మామిడిపల్లి సమస్యలు

విశాలాంధ్ర-సోంపేట: మండలం మామిడిపల్లి గ్రామసమస్యలను ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ దృష్టికి సోమవారం పలువురు తీసుకు వెళ్లారు. ఆ గ్రామస్తుల బృందం ఎమ్మెల్యేను కలిసి బీసీ కాలనీలో రేషన్ డిపో సమస్యను వివరించారు. బీసీ కాలనీ రేషన్ డిపోలో రహస్యంగా వేరొక డీలర్‌ను నియమించడం పట్ల ఫిర్యాదు చేశారు. బీసీ కాలనీ వాసులకు డీలర్ అవకాశం కల్పించాలని కోరారు. అలాగే లోవోల్టేజీ సమస్య పరిష్కారం కొరకు కృషిచేయాలని కోరారు. విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రెయ్యి కోదండ కృష్ణ, తిమ్మల వీరాస్వామి, నూకల సోమేష్, దున్న వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కొండను సర్వే చేపట్టి పట్టాలు అందజేస్తాం: ఆర్డీవో

విశాలాంధ్ర-పలాస: మండలం రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్ షోర్ రిజర్వాయర్ లో ఇల్లులు కోల్పోయిన నిర్వాసితుల గ్రామమైన రేగులపాడు గ్రామస్తులకు సమీపంలో ఉన్న కొండను సర్వే చేసి ఇళ్ల స్థలాల పట్టాలు అందజేయడం జరుగుతుందని పలాస ఆర్డిఓ జి.వెంకటేష్, ప్రభుత్వ జిల్లా లీగల్ అడ్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పలాస మండలం రేగులపాడు కొండలో గొర్రెలు, మేకలు పెంపకం కోసం స్వాధీనంలో స్థలాలపై గ్రామంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి సమీపంలో ఉన్న కొండ ఎంత విస్తీర్ణంలో ఉంది.. ఎవరెవరి వద్ద ఎన్ని సెంట్లు స్వాధీనంలో ఉంది.. పరిశీలించి రెండు రోజుల్లో సర్వే చేపట్టి పట్టాలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఎవరు ఆదీనంలో ఎంత స్థలం ఉంటే అంతటికీ పట్టాలు ఇస్తామన్నారు. ఆఫ్షోర్ రిజర్వాయర్‌లో తమకు స్థలాలు ఇవ్వలేదని ఐదు మంది అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. మరో ముగ్గురు నివాస గృహాలకు నష్టపరిహారం అందలేదని చెప్పగా పలాస మండలం రామకృష్ణ పురం నిర్వాసితుల కాలనీలో ఐదు మందికి ఇళ్ళ స్థలాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వారితో పాటు తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, ఆర్ఐ ప్రసాదరావు, వంశధార ప్రాజెక్టు ఎఇ మీనాక్షి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయండి

ఎంపీపీ ఆరంగి మురళీధర్

విశాలాంధ్ర - నరసన్నపేట: పట్టణంలోని ఆక్రమణదారులు ప్రభుత్వ స్థలాల్లో చేస్తున్న అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయాలని ఎంపీపీ అరంగి మురళీధర్ అన్నారు. సోమవారం ఈ విషయమై శ్రీకాకుళం జిల్లా కలెక్టర్, స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు గ్రీవెన్స్ సెల్‌లో ఆయన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆక్రమణదారులు తమ ఇష్టానుసారం ప్రభుత్వ, పంచాయతీ భూముల్లో అక్రమ నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. అలాగే మేజర్ పంచాయతీ పరిధిలో ఇంటి నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ చేస్తూ, వాణిజ్య సముదా యాలను నిర్మాణం చేస్తున్నారని, ఈ విషయమై పంచాయతీ అధికారులు పట్టించు కోవడం లేదని తెలియజేశారు. ఇప్పటికైనా జిల్లా రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించి, ప్రభుత్వ స్థలాలను ఆక్రమణలు చేసుకొని నిర్మాణం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చింతు రామారావు, వార్డు మెంబర్ రఘు పాత్రుని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో నాలుగు ఇళ్లు దగ్ధం

విశాలాంధ్ర-మందస: మండలం బుడరిసింగి పంచాయితీ పద్మాపురం గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఇళ్లల్లో ఉన్న గృహసామాన్లు, ధాన్యం, డబ్బులు, ఇతర పత్రాలు అన్ని దగ్ధమయ్యాయి. స్థానిక ప్రజలు, గ్రామస్తులు ఈ సమాచారాన్ని అగ్నిమాపక సిబ్బందికి అందించడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీషా, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బాధితులకు ఆర్థిక సహాయం నివాస సౌకర్యం, నిత్యావసర సరుకులు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు తిరుపతి గౌడ, ఒడిసి నవీన్‌లు ఉన్నారు.

శివ నామస్మరణ తో మర్మోగిన శివాలయాలు

ఉమా పాలేశ్వర సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర- సంతబొమ్మాళి:కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా, సంతబొమ్మాళి మండలం లోని శివాలయాలుహర హర మహాదేవ శంభోశంకరా అంటూ శివ నామ స్మరణ తో హోరెత్తాయి. వేకువ జామునుంచే శివాలయాలలో భక్తులు బారులు తీరారు. బోరుభద్ర ఉమాగౌరి రామలింగేశ్వర స్వామి ఆలయంలో వేకువ జామునించే భక్తులు పార్వతీ పరమేశ్వరుల దర్శనము కోసం బారులు తీరారు. సంతబొమ్మాళి ఉమాపాలేశ్వర స్వామి ఆలయం లో వేకువ జామున రెండు గంటల నుంచే ఉమాపాలేశ్వర స్వామి కి ప్రత్యేక పూజలు ఆరంభమాయ్యాయి. ఆకాశలకవరం గ్రామంలో వేంచేసియున్న ఉమామహేశ్వర దేవాలయంలో పూజలు అభిషేకాలు తోపాటు భజనలు వైభవంగా నిర్వహించారు. అలాగే కాపుగోదయవలస శివ సన్నిధిలో పరమశివునికి విశేషపూజలు నిర్వహించారు. మూలపేట ముక్తేశ్వర స్వామి ఆలయంలో వేలాదిమంది భక్తు లు స్వామి ని పూజించారు. జీరు నారంనాయుడు ఆధ్వర్యంలో పూజలు అభిషేకాలు నిర్వహించిన అనంతరం భజన కాలక్షేపం చేశారు. కొల్లిపాడు, మేఘవరం డీజీపురం, నౌపడ, పాలనాయుడుపేట వల్లేవలస, వడ్డివాడ, భావనపాడు, సున్నాపల్లి తదితర గ్రామాల్లో ని శివాలయాలు భక్తులు తో కిటకిట లాడాయి. సంతబొమ్మాళిలో ని ఉమా పాలేశ్వర స్వామి సన్నిధిలో మహాఅన్న సమారాధన కార్యక్రమం జరిగింది. వేలాది మంది భక్తులు ఈ అన్నసమారాధన కార్యక్రమం లో పాల్గొని స్వామి వారి ప్రసాదం ఆరగించి తరించారు. ప్రతి ఏటా మూడో సోమవారం రోజున ఈ అన్న సమాధానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు సంఘటింతంగా భక్తులు సహకారం తో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం నిర్వహించారు.మూడు రోడ్లు కూడలి అయిన ఈ ఉమా పాలేశ్వరస్వామి సన్నిధి అన్నసమారాధన లో సంతబొమ్మాళి పంచాయతీ లోని భక్తులు తో పాటు తాళ్లవలస, వడ్డీతాండ్ర గ్రామ పంచాయతీ లనుంచి భక్తులు తరలి వచ్చి పాల్గొన్నారు. అలాగే రావివలస ఎండల మల్లికార్జున స్వామి దర్శనం కోసం ఆటో లు ద్విచక్ర వాహనాలు లోఈ రూటులో వెళ్లిన వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమం లో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమం లోసంతబొమ్మాళి యస్ ఐ, వై. సింహాచలం ఆధ్వర్యంలోపోలీసులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగ కుండా గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, యువకులు ఈ అన్న సమారాధన లో పాల్గొని సేవలు అందించారు.

ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన మహిళా పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం మహిళా పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి. నారిమణి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహిళా భద్రత, మహిళలకు సంబంధించిన కేసుల పరిష్కారంలో బాధ్యతగా, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అలాగే శక్తి యాప్, నారీ శక్తి కార్యక్రమాలలి ద్వారా మహిళా భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు.

53 ప్రజల అర్జీల స్వీకరణ

- ప్రజా సమస్యల పరిష్కారమే ప్రాధాన్యం
- ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: జిల్లా ప్రజల సమస్యలు, పిర్యాదులు తెలుసుకుని వాటిని తక్షణ పరిష్కారం కల్పించేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమంను జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ పిర్యాదులు, అభ్యర్థనలు, అర్జీలు రూపంలో జిల్లా ఎస్పీ కి నేరుగా అందజేశారు. ప్రతి పిర్యాదును శ్రద్ధగా విని సంబంధిత పోలీసు అధికారులకు ఆయా పిర్యాదులు పరిష్కారం పై ఫోన్ ద్వారా దిశానిర్దేశాలు ఇచ్చి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యం అని ప్రతి పోలీస్ అధికారి ప్రజా పిర్యాదులు పై బాధ్యతగా వ్యవహరించి, పరిష్కార చర్యలు చేపట్టి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా పిర్యాదులు పై తీసుకున్న చర్యలు నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేయాలని స్పష్టం చేశారు. కుటుంబ, ఆస్తి, వ్యక్తిగత, మోసపూరితమైన వంటి వివిధ అంశాలపై 53 పిర్యాదులు స్వీకరించడం జరిగింది.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

విశాలాంధ్ర-నరసన్నపేట:నియోజకవర్గంలోని సారవకోట మండలం అవలింగి గ్రామంలో జేబీటీ పాఠశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రతినిధులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భారతదేశ ప్రథమ విద్యా శాఖ మంత్రి, అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశంలో విద్య అభివృద్ధికి ఆజాద్ ఎనలేని కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వేసిన అబ్దుల్ కలాం ఆజాద్ లోగో పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు, మోహన్ గాంధీ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మరిన్ని విజయాలు సాధించాలి

విశాలాంధ్ర-కవిటి: సంగీతంలో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ప్రధానఆచార్య మార్పు అనిల్ కుమార్ అన్నారు. కవిటి కొత్తూరు ఆర్ష విజ్ఞాన భారతి పాఠశాలకు చెందిన బల్లెడ శ్రీదీక్ష తిరుపతిలో నిర్వహించిన అన్నమయ్య శత సంకీర్తనలో పాల్గొని అందరి మన్ననలు పొందింది. ఈ సందర్భంగా ఆమెకు వచ్చిన బహుమతి. ధ్రువపత్రం, పారితోషకంను ఆ పాఠశాల సంగీత ఉపాధ్యాయులు ఆరంగి.వెంకటరావు, ప్రధానాచార్య అనిక్ కుమార్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీదీక్షను ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా చార్లెస్ పిలిస్ బ్రౌన్ జయంతి

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం చార్లెస్ పిలిస్ బ్రౌన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీడీవో ఎల్ త్రినాథ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రౌన్ తెలుగు బాష అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీవో వై. వర ప్రసాదరావు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంటు శ్రీధర్, ఎస్బిఎం కోఆర్డినేటర్ సల్ల జీవన్, కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్జిఎఫ్ సభ్యులు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం కొండిపుట్టుగ గ్రామానికి చెందిన కొర్రాయి నీలయ్య(40)కు ఎస్జిఎఫ్ సభ్యులు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. నీలయ్య గత 10 ఏళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గత సంవత్సరం నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నారు.తన భార్య ఒక కిడ్నీ ఇవ్వడంతో విశాఖపట్నం సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి చేశారు. కానీ వైద్యానికి అధిక మొత్తంలో ఖర్చు అవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ యువత ఎస్జిఎఫ్ సంస్థకు సమాచారం ఇవ్వడంతో సంస్థ తరుపున తక్షణ సహాయంగా రూ.13 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్జిఎఫ్ సభ్యులు మాట్లాడుతూ దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి నీలయ్య కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

కార్తీక సోమవారాలు సందడి

కిటకిటలాడుతున్న శివాలయాలు

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: కార్తీక మాసం వచ్చిందంటే చాలు శివాలయాలు కిటికీటలాడుతాయి. అది ప్రత్యేకంగా సోమవారాలంటే చెప్పుకోవాల్సిన అవసరం లేదు ఎక్కడ చూసినా భక్తులతో కోలాహలంగా ఉంటాయి శివాలయాలు. మూడో సోమవారం కావడంతో సరుబుజ్జిలి మండలంలోని ఎరగాం మధుర పెద్దమాలపేట లోని నిలకంటేశ్వరుడు భక్తులతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కిట కిట లాడింది. ఇక్కడ శివలింగం స్వయంభు అవడం వల్ల మరియు దక్షిణ కాశీగా పేరుందిన శ్రీముఖలింగంలో ఒక్కటి తక్కువ కోటి శివలింగాల్లో ఇది ఒకటిగా భక్తులు నమ్మకం. అందువల్ల ఈ శివాలయంలో ఎప్పటికప్పుడు రుద్రాభిషేకాలు ప్రత్యేక పూజలు జరుగుతూనే ఉంటాయి. ఈ కార్తీక సోమవారం స్థానికులు, చుట్టుప్రక్కల గ్రామాల వారు ఆలయ ప్రాంగణంలో వనభోజనాలు చేశారు. సాయంత్రం వరకు ఆలయం భక్త జన కొలహాలంతో సందడిగా ఉందని, ఈ ఆలయంలో రోజు కాసేపు కూర్చుంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని భక్తులు తెలుపుతున్నారు.

నీలకంటేశ్వర స్వామిని దర్శించిన ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర-హిరమండలం/పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలో ని శ్రీ శ్రీ శ్రీ నీలకంటేశ్వర స్వామిని కార్తీక మాస 3వ సోమవారం సందర్భంగా పాతపట్నం నియోజకవర్గశాససభ్యులు మామిడి గోవిందరావుసోమవారం దర్శించు కొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో జరిగిన అన్నప్రసాద కార్యక్రమానికి రూ.20,000/- విరాళం అందజేశారు. భక్తులతో స్వామివారి ఆశీర్వచనం తీసుకున్నారు, కార్తీక మాసం ఆధ్యాత్మికతకు ప్రతీకగా ప్రతి భక్తుడు తనలోని భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని, సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర-టెక్కలి: కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి తక్షణం ధాన్యం కొనుగోలు చేయాలని, తేమ శాతాన్ని పెంచాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం టెక్కలి మండల కమిటీ ప్రభుత్వానికి డిమాండ్ చేసింది. టెక్కలి మండలం రైతు మహాసభలో స్థానిక సిఐటీయు కార్యాలయంలో బమ్మిడి సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. గతంలో ఎన్నడు లేనివిధంగా కూటమి ప్రభుత్వంలో ఎరువులు సకాలంలో దొరక్క రైతులు అల్లాడిపోయారని,జిల్లా రైతుసంఘం ఉపాధ్యక్షులు బగాది వాసుదేవరావు అన్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వలన రైతులు నష్టపోతున్నారని అన్నారు. వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలని, జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని, వంశధార ప్రాజెక్టును పూర్తి చేసి అటు ఇచ్చాపురం వరకు, ఇటు చివర భూములకు నీరు అందించాలని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. భూ రీ సర్వేను జరిపి సాగు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతు మహాసభలు ఈ నెల 16 తేదీన టెక్కలిలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా టెక్కలి మండల రైతు సంఘం అధ్యక్షులు గా ఇప్పిలి మల్లేశ్వరరావు , ఉపాధ్యక్షులు గాబొడ్డిపల్లిమల్లయ్య,బమ్మిడి సోమేశ్వరరావు,నెయ్యల క్రిష్ణారావు,కార్యదర్శిగాబగాదివాసుదేవరావు,సహాయ కార్యదర్శి గా పెద్దింటి లచ్చయ్య,బగాది క్రిష్ణా రావు, దారపు సన్యాసి, మరో ఏడుగురు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

న్యాయస్థానం ముందు మందస జూనియర్ కళాశాల వివాదం

నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన కాలేజీ అభివృద్ధికి ఆటంకాలు

విశాలాంధ్ర-మందస: నాలుగు దశాబ్దాలు చరిత్ర కలిగిన మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలను నడుపుతున్న స్థలం వివాదాస్పదంలోకి వెళ్లింది. రాష్ట్రంలోని వివిధ న్యాయ స్థానాలు ముందు ఈ కళాశాల స్థల వివాదం వ్యవహారం ఉండడంతో ప్రజల్లోను. విద్యార్థుల్లోను. మేధావులు. రాజకీయ వర్గాలు. అధ్యాపక వర్గాల్లోను చర్చ జరుగుతోంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 200 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి ఏడాది ఈ కాలేజీలో సీటు సంపాదించాలంటే విద్యార్థులు 10వ తరగతిలో మెరిట్ మార్కులు సాధించాల్సిందే. ఈ కాలేజీలో బిసి, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. మందస ప్రాంతం వెనుకబడిన ప్రాంతం కావడంతో ఈ కాలేజీకి విద్యార్థులు చేరికకు విపరీతమైన డిమాండ్ ఉంది. ప్రతి ఏడాది ఈ కాలేజీ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి కాలేజీకి మంచి పేరు ప్రఖ్యాతలు తేవడం ఆనవాయితీగా వస్తోంది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ కాలేజీ స్థలం వివాదానికి రాజకీయ అంశాలు ముడి ఉండడంతో ఇక్కడ కళాశాల వ్యవహారం ప్రశ్నార్ధకంగా భవిష్యత్‌లో తయారవుతుందని ప్రజలుంటూ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో 1982వ సంవత్సరం నుంచి మందసలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభమైంది. అప్పట్లో ఈ ప్రాంతం ప్రజలు ఆర్థికంగా విరాళాలు అందజేసి కాలేజీ నిర్వహణ కోసం ప్రత్యేకంగా విద్యార్థుల కోసం షెడ్‌లు నిర్మించాలరు. ప్రహరీగోడను నిర్మించడానికి ప్రజలు ఆర్థిక విరాళాలు అందించారు. 1982 సంవత్సరంలో కాలేజీ ప్రారంభానికి ముందు మందస సంస్థానాన్ని పాలించిన చివరి రాజు వారసులు 1981 ఏడాదిలో రాష్ట్ర విద్యా శాఖ ఇంటర్మీడియట్ బోర్డుకు ఒక ఎకరా 47 సెంట్లు భూమిని అందజేశారు. ప్రభుత్వ ఈ స్థలాన్ని కాలేజీకి ఉపయోగించకపోతే రాజుల సంస్థానానికి ఈ స్థలాన్ని తిరిగి అప్పగించాలని అప్పట్లో కండిషన్ పెట్టి రాతపూర్వకంగా అందజేశారు. ఈ షరతులకు లోబడి కాలేజీని ఇక్కడ నడపలేని పరిస్థితులు ఉంటే మళ్లీ రాజుల సంస్థానానికి స్థలాన్ని అప్పగించాలని స్థలం దాతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇదే కాలేజీ పక్కన వాసుదేవుని ఉంది. ఈ ఆలయం ట్రస్టు ప్రతినిధులు కూడా కాలేజీ స్థలం ఆలయానికి చెందినదని కోరుతూ ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. ఈ స్థలంలో ఉన్న కాలేజీని ఖాళీ చేసి తమకు అప్పగించాలని ట్రస్టు ప్రతినిధులు న్యాయస్థానాన్ని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. కాలేజీకి ఉన్న ఆట స్థలంలో కాలేజీ భవనాలను కొత్తగా నిర్మించుకోవాలని కాలేజీ ఆటస్థలం వద్దకు ప్రస్తుతం ఉన్న కాలేజీని తరలించాలని వారు కోరుతున్నారు. కాలేజీకి ఉన్న ఆరు ఎకరాల ఆటస్థలంలో కాలేజీని నిర్మించుకోవాలని ఆలయ ట్రస్టు ప్రతినిధులు విద్యాశాఖను కోరారు. కళాశాలకు స్వాతంత్ర్య సమరయోధులు దివంగత నేత వడ్డి విశ్వనాధం మేఘమాల. చిపీ గ్రామాల రోడ్డు ప్రక్కన సుమారు 6 ఎకరాల భూమిని కాలేజీ ఆటస్థలం కోసం విరాళంగా కళాశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ కాలేజీకి అదనపు భవనాలు నిర్మాణం కోసం 2016లో టీడీపీ ప్రభుత్వ పాలనలో సుమారు కోటి రూపాయలకు పైగా నిధులు మంజూరయ్యాయి. కానీ ఇంత వరకు భవనాలు నిర్మాణం జరగలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో నాడు నేడు పథకం కింద సుమారు 70 లక్షల రూపాయలు కాలేజీ భవనాలు కోసం. మరుగుదొడ్ల అభివృద్ధి కోసం మంజూరయ్యాయి. ఈ నిధులతో అభివృద్ధి పనులు జరిగిన గుత్తేదారులకు ఇంత వరకు బిల్లు బకాయిలు చెల్లింపులు జరగలేదు. కాగా ఈ కాలేజీ అభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు 8 కోట్ల రూపాయలు వరకు నిధులు వెచ్చించి అభివృద్ధి చేసింది.

రహదారి భద్రతకు క్రమశిక్షణే పునాది

- డి.ఎస్.ఎల్.ఎ కార్యదర్శి హరిబాబు

విశాలాంధ్ర-శ్రీకాకుళంరూరల్: వాహనదారులలో క్రమశిక్షణ లోపించడం ప్రమాదాలకు ప్రధాన కారణమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఎం.హరిబాబు పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో స్థానిక న్యాయ సేవాసదన్ లో సోమవారం ఏర్పాటు చేసిన 'మోటారు వాహనాల చట్టం-1988'పై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాహన పత్రాలు, లైసెన్స్ లేనిదే వాహనం నడపరాదని, వాహనాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్, ఫిట్నెస్ సర్టిఫికెట్‌ను కలిగి ఉండాలన్నారు. వాహనాలకి ఇన్సూరెన్స్ ఉండడం వలన రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కోర్టు కేసుల పరిష్కారం త్వరితగతిన జరుగుతుందని, ప్రయాణించేటప్పుడు సురక్షితంగా ఉండాలని, ఏమాత్రం భావోద్వేగాలకు గురి కాకుండా నియంత్రణ పాటించాలని తెలిపారు.అతివేగం ప్రమాదకరమని చెబుతూ అర్హత లేనివారు వాహనం నడపరాదని, మద్యం తాగి వాహనం నడిపితే రూ. 10 వేలు జరిమానా ఉంటుందని తెలిపారు. ప్రజలకు అంతరాయం కలిగించేలా వాహనాలను నిలిపివేస్తే అది నేరంగా పరిగణిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఎ. విజయ సారధి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గంగాధర్, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కె. ఆఫీసు, జి. ఇందిరా ప్రసాద్, ఏపీఎస్ఆర్‌టీసీ అసిస్టెంట్ డిప్యూటీ మేనేజర్ పి. సంతోష్ కుమార్ తో పాటు ప్రైవేట్ బస్సు యజమాన్య ప్రతినిధులు, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

శివాలయాలు వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: మూడవ కార్తీక సోమవారం సందర్భంగా జిల్లాలోని ప్రధాన శివాలయాలు వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఆదేశాల మేరకు సోమవారం ఉదయం జిల్లాలోని ప్రధాన శివాలయాలు డీఎస్పీ స్థాయి అధికారులు పర్యవేక్షణలో పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో శ్రీకాకుళం పట్టణంలో శ్రీ కోటేశ్వర ఆలయంలో టౌన్ డీఎస్పీ భక్తుల రద్దీ, క్రమబద్ధీకరణ, క్యూ లైన్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం లేకుండా ప్రశాంతంగా దర్శనం చేసుకోగలిగేలా క్యూ లైన్లను సక్రమంగా నిర్వహిస్తూ, వాహనాల పార్కింగ్, రద్దీ నియంత్రణ, భక్తుల రాకపోకలకు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ పరిసరాలలో సీసీ కెమెరా మానిటరింగ్, ట్రాఫిక్ డైవర్షన్ చర్యలతో భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేసి పోలీసు అధికారులు ప్రత్యేక పర్యవేక్షణలో భక్తులకు దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టారు.

కాకినాడ శ్రీ ఆదిత్య ఎన్ ఎస్ ఎస్ ప్రత్యేక శిబిరం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్డు లో గల కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు వాకలవలస గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్బం గా విద్యార్థులు వాకలవలస గ్రామ పంచాయతీ కార్యాలయ పరిసరాలను మరియు వీధులను శుభ్రం చేసి మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులు ప్లాస్టిక్ నివారణ కొరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నినాదాలు చేస్తూ ప్లాస్టిక్ ను నివారించమని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు .ప్లాస్టిక్ ముప్పు నివారించే మార్గాలను తెలుపుతూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్ వి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతిరోజు ప్రపంచ వ్యాప్తంగా కొన్ని లక్షల టన్నుల పైగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతున్నదని దీని వలన పర్యావరణానికి ఎంతో ముప్పు జరుగుతున్నదని అన్నారు.ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్ ను నివారించిన యెడల మానవాళిని భవిష్యత్తు ప్రమాదం నుండి కాపాడ వచ్చునని తెలిపారు. తమ విద్యార్థులు చేపట్టిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం సందర్భంగా ప్రజలలో అవగాహన తీసుకురావడం తమ ధ్యేయమని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు వీధి వీధి తిరుగుతూ నినాదాలు చేస్తూ ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు.

అంగరంగ వైభవంగా రెయ్యమ్మ తల్లి ఊరేగింపు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి:సంతబొమ్మాళి మండలం లోని గోవిందపురం లో శ్రీ రెయమ్మ తల్లి సంబరాలు రెండో రోజు సోమవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. సాము గరిడీలు, డప్పు వాయిద్యాలు, మధ్య పుర వీధులలో రెయ్యమ్మ తల్లి ని అత్యంత వైభవంగా ఊరేగించారు. వీధుల్లోకి వెళ్లిన అమ్మవారిని ప్రతి ఇంటి వారు దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. పసుపు కుంకుమ ప్రసాదాలు సమర్పించారు. మూడో రోజున పెద్ద ఎత్తున ఘటాలతో భక్తులు అమ్మవారి కిమొక్కులు సమర్పించనున్నారు. రెయ్యమ్మ దాసుడు రెయ్యి రామిరెడ్డి, ప్రధాన కర్త రెయ్యి ప్రసాదరెడ్డి ఇలవేల్పు రెయ్యమ్మ తల్లి సంబరాలు మూడు రోజులు పాటు జరిపిస్తారు. ఈ సంబరాలు సందర్భంగా అమ్మవారి ఆలయం, గ్రామం లో ప్రధాన వీధులు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరణ చేశారు. అలాగే రాత్రి వేల పలు సాంకృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

డెత్ బెనిఫిట్ ఫైల్ అందజేత

విశాలాంధ్ర-మందస: ఇటీవల స్వర్గస్తులైన సిపిఎస్ ఉపాధ్యాయుని మజ్జి మాలతికు చెందిన డెత్ బెనిఫిట్స్ ఫైల్స్‌ను ఎపిటిఎఫ్ నాయకులు ఉచితంగా తయారు చేసి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 200 మందికి పైగా ఉపాధ్యాయులకు చెందిన ఆదాయ పన్ను, ఈ ఫైలింగ్, టిడిఎఫ్ రిటర్న్స్ ఫైల్స్‌ను పూర్తిగా తయారు చేసి ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు ఎస్.కిరణ్‌కుమార్, కె.సుందరరావు, జి.భీమారావు, డి.చంద్రశేఖర్, కె.జగదీశ్వరరావు, సుశాంత్‌కుమార్ రౌలో, బి.మురళీమోహన్, జి.జానకమ్మ, ఎం.లక్ష్మణరావులు ఉన్నారు.

కన్నుల పండుగగా అయ్యప్ప మహా పడిపూజ

పూజలో పాల్గొన్న రాష్ట్ర మాజీ మంత్రి డా.సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర-పలాస: స్వామియే శరణం అయ్యప్ప,, శరణం శరణం అయ్యప్ప స్వామి శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో మండలంలో బ్రాహ్మణతర్లా అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణం మారుమోగింది. బ్రాహ్మణతర్లాలో అయ్యప్పస్వామి దేవాలయంలో గురుస్వామి బడే షణ్ముఖరావు, పలాస పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు పైల చిట్టిబాబుతో పాటు అనేక మంది అయ్యప్పస్వామి భక్తులు నేతృత్వంలో మహా పడిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో విచ్చేసిన వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు మహా పడిపూజ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్పస్వామి దీక్ష అందరికి మోక్షదాయకమన్నారు. కుల మతాలకు అతీతంగా అందరు ఒకటేనని.. ప్రతి దీక్ష పరునిలో అయ్యప్పస్వామి కొలువై ఉన్నాడని, దీక్షా కాలంలోనే కాకుండా ఆ సుగుణాలను జీవితాంతం పాటించాలని ఆయన ఆకాంక్షించారు. అయ్యప్పస్వామి దీక్ష పరుల్లో దైవంపై ఏకగ్రతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయడం మంచి పరిణామన్నారు. అన్నదానం చేయడం కన్నా పుణ్యకార్యం మరేదీ లేదన్నారు. ఈ మహా పడిపూజ మహోత్సవంలో వైఎస్ఆర్‌సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, వైఎస్ఆర్‌సిపి పలాస పట్టణాధ్యక్షులు శిష్టు గోపి, వైసిపి నేతులు దువ్వాడ రవి, చింతాడ మాధవరావు, దంతం వైకుంతరావు, కళింగ వైశ్యసంఘం ప్రతినిధి నరేష్, జి.మోహనరావు, హరిక్రిష్ణ, తలగాన శ్రీరాములు పాల్గొన్నారు. అనంతరం 6వేల మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

విశాలాంధ్ర శ్రీకాకుళం
పేజీ : 3
మంగళవారం 11, నవంబర్ 2025

గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లు వేయండి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామస్తులు వినతి

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కోసంగిపురం, అడవి కొత్తూరు గ్రామాలకు జాతీయ రహదారిని కలుపుతూ కనెక్టివిటీ రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఈ రెండు గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లు లేక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని ఆస్పత్రులకు వెళ్ళేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. కాగా ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 దరఖాస్తులు వచ్చాయని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు తెలిపారు. అందులో జనన మరణ ధ్రువ పత్రాల కొరకు 7, పెన్షన్ల కొరకు 2, రోడ్డు మంజూరు కొరకు 1 దరఖాస్తు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టిడ్కో ఇండ్ల మంజూరు కొరకు చెల్లించిన డబ్బులు విషయంలో ఉన్న అనుమానాలపై ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ప్రభుత్వం నుండి తగిన మార్గ దర్శకాలు వచ్చిన వెంటనే టిడ్కో ఇండ్ల దరఖాస్తులు పరిష్క రించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

అర్జీలు పరిష్కారానికి సత్వర చర్యలు

– జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: అర్జీలు పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో ఆయన అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులు అర్జీలు పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా 102 అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, ఇన్ చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, జి. జయదేవి, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్ లు ఉన్నారు. జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సొంత స్థలం ఉంటే ఇళ్లు కట్టుకోవచ్చు

సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు

విశాలాంధ్ర-కవిటి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ ఆవాస ప్లస్ పథకం ద్వారా సొంత స్థలం ఉంటే ఇళ్లు కట్టుకోవచ్చునని సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం నవంబర్ నెల 30 వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సొంత స్థలం ఉండి ఎల్పిసి రిజిస్టర్ డాక్యుమెంటు,క్యాస్ట్, ఇన్కమ్ సర్టిఫికెట్లు,బ్యాంకు ఖాతా,ఆధార్ నెంబర్, ఫోన్ నంబర్తో సచివాలయం పరిధిలో గల ఇంజనీరింగ్ అసిస్టెంట్ వద్దకు వెళ్ళి యాప్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.గతంలో ఎటువంటి హౌసింగ్ స్కీమ్లో పేరు నమోదై ఉండరాదన్నారు.పట్టణంలో కూడా ఈ అవకాశం ఉందనీ అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 9949256501కు సంప్రదించాలని తెలిపారు.పట్టణంలో కూడా సచివాలయంలో పరిధిలో గల సెక్రెటరీకి సంబంధిత ధృవీకరణ పత్రాలు అందించాలని తెలిపారు.పరిధిలో గల హౌసింగ్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీరు వారిని కలసి దరఖాస్తు అందజేయాలని తెలిపారు.

భక్తిపారవశ్యంలో శైవక్షేత్రాలు

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం జగతి,కవిటి, బొరివంక తదితర శైవక్షేత్రాలులో భక్తులతో కళకళలాడాయి. ఈ మేరకు బొరివంక గ్రామంలో ఘనంగా రామలింగేశ్వర స్వామి వారి తిరువీధి కార్యక్రమం చేపట్టారు.అలాగే కార్తీక వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉద్దానం యూత్ క్లబ్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని క్లబ్ సభ్యులు ఏర్పాటు చేశారు.అనంతరం జరిగిన స్వామివారి తిరువీధి కార్యక్రమంలో భాగంగా స్థానిక కళాకారులచే ప్రదర్శించిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.ప్రతి ఏటా కార్తీకమాసంలో మూడవ సోమవారంలో నిర్వహించే ఈ పూజా కార్యక్రమాలు గత కొన్నేళ్ల ఆనవాయితీగా చేస్తున్నామని క్లబ్ సభ్యులు తెలిపారు.

వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ స్వప్నవాహిని

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ సైన్స్ కళాశాల నూతన ప్రిన్సిపాల్ (ఎస్ఏసీ)గా బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. స్వప్నవాహిని నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆమెకు నియామకపత్రాన్ని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అందజేశారు. ఈ పదవిలో ఈమె మూడేళ్లపాటు కొనసాగుతారు. 2008లో ఏర్పడిన బీఆర్ఏయూలో పదేళ్ల తర్వాత 2018లో సైన్స్ కోర్సులకు ప్రత్యేక కళాశాల ఏర్పాటైంది. ఈ కళాశాలకు డాక్టర్ స్వప్నవాహిని మూడో ప్రిన్సిపాల్గా వ్యవహరించనున్నారు. 2010లో బీఆర్ ఏయూలో స్వప్నవాహిని అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కేరీర్ ప్రారంభించి వివిధ హొదాల్లో ప నిచేశారు.

గర్భిణీలకు ప్రత్యేక పరీక్షలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఎచ్చెర్ల పీహెచ్సీలో 40 మంది గర్భిణీలకు సోమవారం ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హైరిస్క్ గర్భిణీలకు ప్రత్యేకంగా పరీక్షించి అవసరమైన సూచనలు చేశారు. జేమ్స్ ఆసుపత్రి సహకారంతో ఉచిత స్కానింగ్, రక్త, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. పీహెచ్సీ వైద్యులు డాక్టర్ గంగప్రియ దర్శిని, డాక్టర్ ఎం. ఉషశ్రీ, సీహెచ్వో బి.రమేష్ బాబు పాల్గొన్నారు. అలాగే అల్లినగరం సత్యసాయి కమిటీ ఉచిత భోజనాన్ని అందజేశారు.

రూ.85 లక్షలతో ఉపాధి పనులు గుర్తింపు

విశాలాంధ్ర-కవిటి: కవిటి పంచాయతీలో ఉపాధి హామి పథకంలో 2026- 27 ఆర్థిక సంవత్సరంలో రూ.85 లక్షల అంచనా నిధులతో పనులు గుర్తించినట్లు సర్పంచ్ పూడి.లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం కవిటి సచివాలయంలో ఉపాధి హామీ పథకం భవిష్యత్తు ప్రణాళికపై సమావేశం నిర్వహించడం జరిగింది. ఇందులో వచ్చే ఏడాదికి అవసరమైన పనులు గుర్తించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బెందాళం.రమేష్,ఎంపీటీసీ ధర్మారావు, ఉపసర్పంచ్ దుర్యోధన,మాజీ సర్పంచ్ ఆరంగి మధు,వజ్జ రంగారావు,ఈవో రవి,ఏపీవో మోహన రావు,ఈసీ నీలంబర్,సచివాలయ సిబ్బంది,క్షేత్ర సహాయకులు,ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర-సోంపేట: బారువ మెరైన్ పోలీస్ వారి ఆధ్వర్యంలో ఫిజికల్ డైరెక్టర్ కోద శ్యామలరావు, యువ భారత్ ప్రతినిధి ఎరుపల్లి గణేష్ పర్యవేక్షణలో బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి సోమవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విజేతలకు క్రీడా సామాగ్రిని అందించారు. క్రీడల వలన కలిగే ప్రయోజనాలు, మత్తు పదార్థాల వాడకం వలన కలిగేనష్టాలను వివరించి వారికి అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు ముఖ్యఅతిథిగా మెరైన్ ఎస్సై శ్రీనివాసరావు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఎఎస్సై కోదండరావు, హెడ్‌కానిస్టేబుల్ దుర్గారావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బీల ఉద్యమకారిణి రోహిణమ్మ మృతి

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట బీలలో థర్మల్ విద్యుత్ కర్మాగారానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో చైతన్యవంతమైన పాత్ర పోషించిన ఇరోతు రోహినమ్మ సోమవారం మృతి చెందారు. బీల ప్రాంతంలో పచ్చని పంటలు పండే చిత్తడి నేలల్లో విద్యుత్ కర్మాగారం ఏర్పాటు వల్ల ఈ ప్రాంతమంతా కాలుష్యమై జనం ప్రమాదంలో పడతారని భావించిన రోహిణమ్మ పోరాటానికి బాసటగా నిలిచింది. ప్రతి సమావేశంలో, ప్రతి ఆందోళన కార్యక్రమంలోను, ప్రతి నిరసన కార్యక్రమంలోను ఆమె స్వయంగా పాల్గొనడంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల మహిళలను చైతన్యపర్చడంలో ఆమె ఎంతో కీలక పాత్ర పోషించింది. బీసీ సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావుతో పాటు మరికొంత మంది నేతలు సోమవారం రోహిణమ్మ కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రోహిణమ్మ సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

దేవాలయల్లో ఏకాం భజనలు

విశాలాంధ్ర -పోలాకి: కార్తీక మాసం మూడవ సోమవారం పర్వదినం కావడంతో భక్తులు మహిళలు పెద్దఎత్తున శివనామస్మరణతో శివాలయాల్లో క్యూ లైన్‌లో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ మేరకు మండలంలోని పలు రామాలయాల్లో నరసాపురం వెధుళ్ల వలస, పోలాకి తదితర ఆలయాల్లో సంగీత కళలు కళాకారుల ఏకాం భజనలతో మారు మ్రోగాయి.

కృష్ణాపురంలో లక్ష దీపార్చన

విశాలాంధ్ర - కొత్తూరు: మండలం మెట్టూరు, 1 కృష్ణాపురంలో వెలిసియున్న శ్రీ ఉమా నీలకంటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక మూడో సోమవారం సందర్భంగా లక్ష దీపార్చన కార్యక్రమం కమిటీ నిర్వహించింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భూర్లి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో దీపార్చన చేశారు. అన్న ప్రసాదం వితరణ చేశారు.

ఏ.క్యూ.జే. కాలేజీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

విశాలాంధ్ర - ఆనందపురం: ఏ.క్యూ.జే. కాలేజీ ఆధ్వర్యంలో పాలవలస గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.సుధారాణి, పాలవలస వైస్ ప్రెసిడెంట్ నిమ్మల అప్పలరాజు, స్థానిక ఎంపీయూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సన్యాసిరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల డైరెక్టర్ సుధారాణి మాట్లాడుతూ 7 రోజుల పాటు నిర్వహించే ఈ ప్రత్యేక శిబిరంలో విద్యార్థులు దత్తత గ్రామమైన పాలవలసలో పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు సేవ చేయనున్నారని తెలిపారు. శిబిరంలో విద్యార్థులు పరిశు భ్రత, వృక్షారోపణ, గ్రామాభివృద్ధి, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు వంటి పలు కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలియజేశారు.

భారతీయ భాషల్లో హైడ్రోజన్ ఎనర్జీపై అవగాహన

విశాలాంధ్ర - తగరపువలస: ఏఐసిటిఈ వాణి ఆధ్వర్యంలో జరుగుతున్న "భారతీయ భాషల్లో హైడ్రోజన్ ఎనర్జీ: అవగాహన మరియు ఆవిష్కరణ" అనే 3-రోజుల వర్క్‌షాప్ రెండవ రోజు అవంతి కళాశాలలో విజయవంతంగా నిర్వహించారు. ఉదయం సెషన్‌లో డా. కె. సంపత్ కుమార్, ప్రాజెక్ట్ ఇంజనీర్, ఎన్ ఎస్ టి ఎల్ విశాఖపట్నం, "హైడ్రోజన్ నిల్వ వ్యవస్థలు " అనే అంశంపై విశ్లేషణాత్మకంగా ఉపన్యాసం అందించారు. మధ్యాహ్న సెషన్‌లో డా. ఎస్. హెచ్. షరీఫ్, అసోసియేట్ ప్రొఫెసర్ మరియు వర్క్‌షాప్ కోఆర్డినేటర్, అవంతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సుస్థిర అభివృద్ధిలో హైడ్రోజన్ ఇంధన ప్రాముఖ్యతపై విస్తృతంగా వివరణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ డా. బి. మురళీ కృష్ణ డైరెక్టర్ డా. ఏ చంద్ర శేఖర్ రెండవ రోజు కార్యక్రమాన్ని ప్రశంసించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్య పరిస్థితులను మెరుగుపర్చుకోవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ వనజ ఆదేశాలతో స్థానిక ఎన్.ఎస్.ఎస్ పి.ఓ పాండవ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో తేలుకుంచి గ్రామాన్ని ప్రత్యేకంగా ఎంపిక చేసారు. వారం రోజుల పాటు గ్రామంలో నిర్వహించే ప్రత్యేక శిబిరాన్ని సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రారంభించారు. గ్రామానికి 50 మంది ఎన్.ఎస్. ఎస్ విభాగం విద్యార్థులు చేరుకోవడం సందడి నెలకొంది. గ్రామంలో వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో మొదటి రోజుల శివాలయం, అమ్మవారి గుడి ప్రాంగణాలను విద్యార్థులు శు భ్రపరిచారు. రోడ్లపై వేసిన చెత్తలను తొలగిస్తూ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో ప్రిన్సిపల్ మాట్లాడుతు దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఇం నీ పారిశుధ్యం చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖర్ , మాజీ ఎమ్పీటీసి సూర్యనారాయణ, అధ్యాపకులు దుర్యోధన, లోకేష్ , రాధ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

ఆనందపురం హైస్కూల్లో బోరు ఏర్పాటు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండల పరిషత్ అధ్యక్షురాలు మజ్జి శారదా ప్రియాంక ఎం.పి.పి నిధుల ద్వారా సుమారు రూ.2 లక్షల వ్యయంతో ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద బోరు మంజూరు చేశారు. ఈ బోరు పూజా కార్యక్రమాన్ని ఎం.పి.పి ప్రతినిధి మజ్జి వెంకటరావు, కోఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు చందక సూరిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, ఎక్స్ సభ్యులు సత్యమూర్తి చేతుల మీదుగా నిర్వహించారు.సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థుల తాగునీటి అవసరాల నిమిత్తం ఈ బోరు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, శంకరరావు, త్రినాథ్, ముత్యాలనాయుడు, సునీత, శ్రీ విద్య, పూర్వ విద్యార్థి ఇల్లాపు వెంకటరావు (జగన్) తదితరులు పాల్గొన్నారు.